అంతా కనికట్టు

చెన్నకేశవులు అన్నిటికీ తెగించి మరీ కూచున్నాడు. బాగా పదునుపెట్టి వెంటతెచ్చుకున్న గీతకత్తి. గడ్డివామి నానుకునివున్న వేపచెట్టు కొమ్మల్లోంచి తొంగిచూసిన చంద్రుడి కళ్ళను జిగేలుమనిపించింది. అతడు చేరగిలబడి కూచున్న గడ్డివామి వెనక పందికొక్కుల్లో, వెంట్రవలో గుర్రుగుర్రుమంటూ చావుబతుకుల పోరాటం చేస్తున్నవి. వామి చుట్టూ వున్న చిళ్ళకంచె కొమ్మల రెమ్మల మధ్య గూడుకట్టుకున్న గువ్వపిట్టల జంట బెదిరి 'కుర్ కుర్' మన్నది.

చెన్నకేశవులు కూచున్నచోటునుంచి లేచి, చిళ్ళకంచె దగ్గిరకు పోయి మోకాళ్ళమీద వంగి డొంకకేసి కళ్ళు చికిలించి చూశాడు. డొంక నిర్మానుష్యంగా వున్నది. డొంకకు రెండువైపులా చిత్తవొత్తుగా పెరిగిన ఈతచెట్ల చీకటి నీడలకేసి పరీక్షగా చూశాడు. అక్కడేదో ఆకారం ఒకటి హఠాత్తుగా ఒక ఈతచెట్టు కింద నుంచి దెయ్యంలా గెంతి లేచి నిలబడి, అతడున్న చోటుకేసి, గబగబా నడిచి రావటం కనిపించిందతడికి.

'పొరబడ్డాను, ఇద్దరనుకున్నాను. ఒకళ్లాగేవుంది' అనుకుంటూ కేశవులు తలకు చుట్టుకున్న

తుండుగుడ్డను ఊడదీసి, అందులో గీతకత్తిని భద్రంగా చుట్టి పట్టుకొని, నక్కుతూ వెళ్ళి, గడ్డి వామికి ఒక పక్కగా వంగి నిలబడ్డాడు.

ఈతచెట్ల నీడల చాటునుంచి పిశాచంలా కుప్పిగంతేసి బయలు దేరిన ఆకారం సూటిగా చిళ్లకంచె దగ్గిరకు వచ్చి, లోపలకొచ్చే దారికి అడ్డంగా పెట్టిన వాసాల్లోనుంచి లోపలకు దూరుతూ, "కేశవులూ, జాగత్తరోయ్, గీతకత్తితో మెడ తెగేశేవ్!" అంటూ కేక వేసింది.

కేక వింటూనే, ఆ గొంతు గుర్తుపట్టిన చెన్నకేశవులు వామిచాటు నుంచి బయటికొస్తూ, "ఎవ్రా...బొబ్బిలా? గీతకత్తేంటి?" అన్నాడు.

బొబ్బిలి పిచ్చెత్తినవాడిలా కాండ్రించి నవ్వుతూ, "తెలుసురోయ్, కేశవులూ! నీ యవారం అంతా తెలుసురోయ్. అరకోసెడంలో చెట్టు కింద తొంగి కూచున్న నాకు, ఎన్నెల పడి ఆ గీత కత్తి మెరవటం కంటబడింది. ఆ పళాన లేచి బయల్దేరాను. ఆహాఁ మనోడే కేశవులు అన్న దయిర్యంతో!" అన్నాడు.

"ఇక్కడికి రాటానికి దయిర్యం ఎందుకు? మనం యిరొదోళ్ళం కాదే!" అన్నాడు కేశవులు.

"మనం కాదనుకో. నువ్వు కాపలా ఏసినోళ్ళెవరో నీకు తెలిస్తే సిక్కేలేదు. ఆళ్ళే నేననుకొని, సీకటిమాటున కత్తిసురుతావేమో అని బయపడ్డాను" అంటూ బొబ్బిలి, వామిలో గడ్డిని చేతుల్తో తడువుతూ, ఒక చోట ఆగి, "యిక్కడేగా నీ దాపరీకం. ఎన్ని కాయలు దాశావ్? నా కోటి సాలు" అంటూ గడ్డిలోనుంచి రెండు సీసాలు బయటికి లాగాడు.

కేశవులు ముఖం కందగడ్డలా అయింది. కళ్ళు చింతనిప్పుల్లా కణకణ మన్నాయి. అతడు ఒక్క ఎగురున వెళ్ళి, బొబ్బిలి చేతుల్లో నుంచి, రెండు సీసాకాయలూ లాక్కుని, "రోజూ రాత్రేళ నా కన్ను గప్పి దొంగమేత మేసేవాళ్ళలో నువ్వు కూడా వున్నావా?" అని అడిగాడు.

"నేనా! ఛీ ఛీ. ఆ దగుల్బాజీ వెధవలిద్దరితో నే యాకమవుతా ననుకున్నావా? ఎం మాటరోయ్. కేశవులూ!" అన్నాడు బొబ్బిలి కాస్త కోపంగా.

"వాళ్ళల్లో ఓడివి కాపోతే, నీకీకాయలు వామిలో ఎక్కడ దాచిందీ ఎలా తెలిసింది? వాళ్ళిద్దరన్న మాట ఎలా ఎరిక?" అని నిలదీశడిగాడు కేశవులు.

"వీడు బొబ్బిలి కాదురా, బెబ్బులి! అదేరా, మా అయ్య పెట్టిన పేరు నిలుపుకొస్తున్నా. ముప్పై ఏళ్ళ నుంచీ దొంగసారా అమ్మకు బతకటమే నీశం. అది దొంగతనంగా తాగిపోటం అంతకన్నా నీశం" అన్నాడు యీసడింపుగా.

"అయితే, యీ గొడవంతా నీకెలా తెలిసింది?" అన్నాడు కేశ వులు కొంచెం స్థిమితపడుతూ.

"నిన్న తెల్లారుజామున బస్తీకి పోతూంటే, ఆళ్ళిద్దరూ ఆ డొంక మలుపులో నా కెదురుపడ్డారు. ఇద్దరూ తూలిపడి లేస్తున్నారనుకో. లొల్లాయి పదాలు కూడా పాడుతున్నారు. నిలదీసి అడిగి, టలాయించబోతే, చాచి రెండిచ్చుకున్నాను. అంతా చెప్పేశారు. నువ్వెవరికోసమో వామిలో దాశి పోతున్న రెండు కాయలూ పది రోజులుగా వాళ్ళు దొంగచాటుగా వచ్చి తాగేశి పోతున్నారట. ప్రాణాలు తీసేస్తానని సెప్పాను. ఇక యిటుకేసి రామన్నారు. ఆమాట నిలుపుకుంటారో లేదో

సూద్దామని కొంతా.... ఏదో కాస్త కుతెక్కి కొంతా.... ఆ ఈత చెట్లెనక కాపలా ఏశాను. నీ సేతిలో గీతకత్తి తళుక్కుమన్నది. కోసెయ్యటానికి రడీగా వున్నావని తెలుసుకుని యిటొచ్చాను. నువ్వేమో నన్నే దొంగముండావాడికింద కట్టి మాట్టేదేస్తన్నావు" అన్నాడు బొబ్బిలి గుక్కతిప్పుకోకుండా.

"ఇదంతా నమ్మమంటావురా, బొబ్బిలీ! నా మీద ఒట్టేనా? సరే, ఆ దొంగలంజీకొడుకులిద్దర్నీ చూశావు. ఆళ్ళు సెప్పిందంతా యిన్నావు. ఇక పద...రేపు కోర్టుల్లో నువ్వు నాకు సాచ్చీకం పలకాల" అంటూ కేశవులు, కాపుసారా కాయలు రెంటినీ తిరిగి గడ్డివామిలో దాచబోయాడు.

బొబ్బిలి ఒక్క ఎగురున వెళ్ళి, కేశవులు చేతిలోంచి ఒక సారాకాయి వూడలాక్కుని, "ఆ కోరటూ, సాచ్చీకం మాట సరేలేరా, కేశవులూ! దొంగసారా అమ్ముకునేవాడివి కోరటులో కెలా పోతావ్? ముందు కాస్త గొంతు తడిపేసుకోనీ!" అంటూ కాయకు బిగించిన మొక్కజొన్న బెండు మూతను ఆత్రంగా గుంజబోయాడు.

చెన్నకేశవులు బరిశెపోటు తిన్నవాడిలా ఒక గావుకేక పెట్టి, "చస్తావురో బొబ్బిలీ, తాక్కు ... తాక్కు ...తాక్కు!" అంటూ బొబ్బిలి మీద కలియబడ్డాడు.

ఆసరికి బొబ్బిలికి రోషం, కోపం గుండెలకు ఎగదన్నింది. కేశవులు వాలకం అతడికి చిర్రెత్తించింది. చేతులోవున్న సారకాయితో కేశవులు గుండెల్లో గట్టిగా ఒకపోటు పొడిచి, అతడు వెనక్కు పడ బోయేంతలో ఆపి, జుట్టు పట్టుకుని, "ఏరా, నాతో పరాచికాలతో మొదలెట్టి కుస్తీపట్టుకే తయారయ్యావా? నీక్కావలసింది ఎదవ డబ్బులే గందా. ఇదో. రొంటినున్నె తీసేసుకో. కాపుసారా అమ్ముకు బతికే కుక్కల కొడుకువి. నా మీద కలబడతావా? చీల్చేస్తాను" అంటూ అరిచాడు.

కేశవులు అటూ యిటూ గుంజుకుని, బొబ్బిలి చేతిలోంచి జుట్టు విడిపించుకుని వగరుస్తూ, "నేను డబ్బు కోసం గడ్డితినే వాణ్ణనుకోకురా, బొబ్బిలీ అసలు సంగతేందో చెప్పేస్తాను...అరె, మూత తియ్యకు, ఇక్కడ వామిలో నేను రహస్యంగా దాచుకుపోయిన సారా, దొంగతనంగా వచ్చి తాగిపోయే ఆళ్ళిద్దరినీ అతమార్చేందుకు, ఆ సారాలో యియ్యాళ ఎలిక మందు కలిపాను. పెద్ద ఒట్టు" అన్నాడు.

"దొంగసారా యాపారంవోడి ఒట్టూ సొట్టూ ఎవణ్ణమ్ముతాడ్రా? ఎలిక మందు కలిపినోడివి అలా వూరుకోక. గీత కత్తెందుకు పట్టుకిక్కడ కూచున్నవ్. ఎహె పోరా చుంచుమొహం" అంటూ బొబ్బిలి సీసా మూత వూడలాగి, తాగేందుకు సీసా పైకెత్తాడు.

ఈసారి కేశవులు గుండెలు బద్దలయ్యేంత పెద్దగా, చుట్టుపక్కల కోసెడు దూరం వినపడేంత బిగ్గరగా ఒక్క కేకపెట్టి, బొబ్బిలి మీదికి లంఘించాడు. బొబ్బిలి ఆసరికే సీసాఎత్తి అందులోని సారా దాదాపు సగం గడగడా తాగివేశాడు. కాపుసారాల రుచీ వాసనా బాగా తెలిసిన అతగాడిక్కూడా యిందులో ఏదో కొత్త రకం వాసనా రుచీ వున్నట్టు కనిపించింది. అంతలో కేశవులు అతడి మీద ఎనుబోతులా విరుచుకుపడ్డాడు. ఆ ధాటికి తట్టుకోలేక వెనక్కు పడబోయిన బొబ్బిలి, ఓ తృటికాలం కాళ్ళు నిలదొక్కుకుని, చేతిలోని సారాసీసా బాగా పైకెత్తి వూపు బలంగా, కేశవులు తలకేసి ఒక్క

విసురు విసిరాడు. కాని, అదృష్టం కొందికీ ఆ దెబ్బ కేశవులి తలమీద కాక, భుజం మీద పడింది. కేశవులు ఒక చావుకేక పెట్టి బొబ్బిలిని అమ్మనాలీ బూతులు తిడుతూ, చాపచుట్టలా దభీమని కింద పడిపోయాడు.

బొబ్బిలి యిదేం గమనించే స్థితిలో లేడు. సారా కడుపులోకిపోయి ఒకటి రెండు నిమిషాలయిందో లేదో – అతడికి గుండెల్నెవరో పటకారుతో పట్టి గుంజినట్టు బాధ కలిగింది. గొంతు అర్చుకు పోసాగింది. కళ్ళు బైర్లు కమ్మినై. అతడు రెండు చేతుల్తో గొంతు పట్టుకుని ఎగశ్వాసా దిగశ్వాసా అయిపోతూ, "కేశవులూ, నువు చెప్పింది నిజం!" అంటూ గడ్డివామిని ఆసరాగా పట్టుకు నిలబడ బోయి, కాళ్ళు తేలిపోగా, నేలమీద బోర్లా పడిపోయాడు.

బొబ్బిలికి స్పృహ వచ్చినట్టయి పరిసర జ్ఞానం తెలిసేసరికి, అతడు ముత్రాసోళ్ళ తాటితోపుకేసి నడుస్తున్నాడు. ఆసరికి చంద్రుడు ఆకాశ మధ్యం నుంచి కిందికి బాగా దిగజారి, దాని అంచు పట్టుకు వేలాడుతున్నాడు.

'ఇంటికెళ్ళే దారొదిలి, యీ దెయ్యాల తోపు కేసెందుకొచ్చా నబ్బా!' అనుకున్నాడు బొబ్బిలి.

అతడికి దెయ్యాల భయం జాస్తి.

'ఎలిక మందు కలిపిన సారా తాగి బయట పడ్డాను. ఇంకా భూమ్మీద నూకలున్నయన్నమాట! ఇంటికే పోదాం. ఈ దెయ్యాల తోపులోకెందుకు?' అనుకుంటూ బొబ్బిలి వెనక్కు తిరగబోయాడు. అంతలో తాటితోపు అంచునవున్న పెద్ద దిరిశెన చెట్టు కొమ్మలు కిరకిరమన్నవి. గుండె ఆగినంతపనై బొబ్బిలి అటుకేసి చూశాడు. అక్కడ కొమ్మల మీద నల్లని ముసుగులు కప్పుక్కూచున్నట్టున్న ఆకా రాలు నాలుగైదతడికి కనిపించినై. బొబ్బిలికి గుండె ఆగిపోయి నంతపనైంది. గిరుక్కున వెనక్కు తిరిగి దౌడుతీయబోయాడు. ఏదో ఆకారం ఒకటి దారికి అడ్డం నిలబడినట్టయింది. బొబ్బిలి కెవ్వు మని కేక వేశాడు.

"అంత బెదిరిపోతావేం. బెబ్బులీ! నే నెవరనుకున్నావ్? ధర్మయ్యని. ఆ వాముల దొడ్లో ఒళ్ళూ పై తెలియకండా పడున్న నిన్ను, యిక్కడ దాకా చేతి ఆసరాతో నడిపించుకొచ్చింది నేనే!" అన్నదా ఆకారం.

"ఎవరూ? ధర్మయ్యా? దెయ్యాలపోతు ధర్మయ్యా? చచ్చాన్రో బాబో!" అంటూ బొబ్బిలి కీచుమని ఒక్కెగురెగిరాడు.

దెయ్యాలపోతు ధర్మయ్య, బొబ్బిలిని అంత ఎత్తున గాలిలో అలాగే పట్టుకుని సుతారంగా భూమ్మీద ఎత్తి కుదేస్తూ, "ఎందుకంత గాభరాపడిపోతావ్, బెబ్బులీ?" అని ప్రశ్నించాడు.

బొబ్బిలి నిలువెల్లా వణికిపోతూ, బొంగురు పోయిన గొంతుతో, "నువ్వు దెయ్యానివి. నాలుగైదేళ్ళ క్రితం నీ శవం యీ ముత్రాసోళ్ళ తాటితోపు మధ్యున్న దిగుడుబావిలో తేలటం నేను చూశాను" అన్నాడు.

"అదంతా కనికట్టు! నే చేసిన పంపకం దెబ్బ!" అన్నాడు ధర్మయ్య కోరమీసాలు మెలివేస్తూ.

"ఏం కనికట్టు? ఏదో చాతబడి చేశావని మారయ్యగారి కుమారయ్య నీ పళ్ళూడగొట్టి, పలుగుతో

గుండెల్లో పొడిసి ఆ దిగుడు బావిలో పారెయ్యలేదా?" అన్నాడు బొబ్బిలి, ధర్మయ్య ముఖంలోనికి గుచ్చిగుచ్చి చూస్తూ.

"అదంతా కనికట్టు! నీ మేలుకే చెబుతున్నాను. నా మాట నమ్ము. అదుగో, ఆ కనబడే దిరిశెన చెట్టు మీదో కుంకుడు చెట్టు మీదో దాక్కుందాం పద" అంటూ ధర్మయ్య, బొబ్బిలి చేయి పట్టుకున్నాడు.

బొబ్బిలి గుండె బితుకు బితుకుమంటూ ధర్మయ్య చెప్పిన దిరిశెన చెట్టుకేసి చూశాడు. ఆ చెట్టు కొమ్మల్లో నాలుగాకారాలు కూచుని వున్నవి. తను అటుకేసి వస్తున్నప్పుడు చూసినట్టు, వాటికేమీ నల్లని ముసుగుల్లేవు, దయ్యాల మాదిరిగా.

"నేనింతకుముందా కొమ్మల మీద నల్లగా ముసుగులు కప్పుకున్న నాలుగు దెయ్యాల్ని చూశాను" అన్నాడు బొబ్బిలి.

"అదంతా నీ భ్రమ బెబ్బులీ! ఎలుకల మందు కలిపిన సారా తాగి నీ కళ్ళు చెదిరిపోయి అలాంటి భ్రమ కల్పించినై. ఇప్పుడు జాగ్రత్తగా చూడు...తెలుస్తున్నదా? వాళ్ళూ మనలాంటివాళ్ళే" అన్నాడు ధర్మయ్య.

హఠాత్తుగా బొబ్బిలికి మరింత పెద్ద అనుమానం కలిగింది. ఈ దెయ్యాలపోతు ధర్మయ్య తనని ఇంటికెళ్ళకుండా ఆపేందుకింత శ్రమెందుకు పడుతున్నాడు? ఆ నలుగురూ మనుషులైతే, యీ చీకటి రాత్రివేళ చెట్టు కొమ్మలెక్కి ఎందుక్కూచున్నారు?

ఇలాంటి అనుమానాలేవేవో బొబ్బిలి మనసులో కదులుతున్నట్టు గ్రహించిన వాడిలా ధర్మయ్య పెద్దగా నవ్వి, "నీకింకా కొత్త.... అంటే....ఈ హత్యలు చేయటం...పోలీసోళ్ళకు దొరక్కుండా దాక్కోవటం...తెలిసిందా? ఆ కొమ్మల్లో వున్న నలుగురూ నీకన్న తక్కువ తిన్నోళ్ళేం కాదు. నీవు చెన్నకేశవుల్ని చంపినట్టే, వాళ్ళూ తలా ఒకణ్ణి చంపారు. పోలీసులకి దొరక్కుండా యీ తాటితోపులో చేరి చెట్ల కొమ్మల్లో దాక్కుని కాలం గడుపుతున్నారు. నువ్వూ, ఉరిశిక్ష తప్పుకో వాలంటే, యిక్కడ మాతో పాటు కొన్నాళ్ళపాటు కాలక్షేపం చెయ్యక తప్పదు" అన్నాడు.

తను చెన్నకేశవుల్ని సారాసీసా పెట్టి గట్టిగా నెత్తిమీద కొట్టిన సంగతి అప్పటిగ్గాని బొబ్బిలికి గుర్తురాలేదు. వాడు నిజంగా చచ్చుంటాడా?

"కేశవులు నిజంగా సచ్చాడా ధర్మయ్యా?" అన్నాడు బొబ్బిలి.

"ఇంకా తెలీదు. చచ్చే వుండొచ్చు. నువ్వూ, వాడూ వాముల దొడ్లో చేసిన అహిమహిరావణ యుద్ధం విని గూడెం వాళ్ళు లాంతర్లూ, కర్రలూ తీసుకుని అక్కడ కొచ్చిపడ్డారు. వాళ్లొచ్చేసరికే నువ్వు యింత నెత్తురూ, యిన్ని పేగులూ వెళ్ళగక్కుని, ప్రాణం కడ ముట్టి పడున్నావు. కేశవులు కొనూపిరితో కుస్తీపట్లు పడుతూండగా, డోలీలో పడేసి వాళ్ళతన్ని బస్తీకి మోసుకుపోయారు" అన్నాడు ధర్మయ్య.

"మరి నన్నెలా వదిలారు వాళ్ళు?" అని ప్రశ్నించాడు బొబ్బిలి అనుమానంగా భయంగా ధర్మయ్య ముఖంలోకి చూస్తూ.

"అక్కడే ధర్మయ్య తెలివితేటలు బయటపడింది. దెయ్యాలపోతుగా నా మంత్రశక్తులెలాంటి వనుకున్నావ్? కనికట్టుచేసి ఆ గూడెం వాళ్ళందరి కళ్ళూ కప్పి, నిన్ను ఆ చిళ్లకంచె మీదుగా దాటించి, యిక్కడికి తీసుకొచ్చాను" అన్నాడు ధర్మయ్య, పెద్దగా ఖాండ్రించి ఉమ్ముతూ.

"నాకంతా ఏదో అయోమయంగా, తిక్కతిక్కగా, మగత మగతగా వుంది ధర్మయ్యా" అన్నాడు బొబ్బిలి, దిరిశెన చెట్టు కొమ్మలకేసి బిత్తరచూపులు చూస్తూ.

"ఉండదా మరి, బొబ్బిలీ!" అంటూ ధర్మయ్య. బొబ్బిలి భుజం మీద చేయివేసి, తాటితోపుకేసి నడిపిస్తూ. "ఆ చెన్నకేశవులుగాడు ఆ కాపుసారా కాయల్లో మాంచి ఘాటైన మోతాదులో ఎలుక మందు కలిపాడన్నమాట మరిచిపోకు. ఆ సారా ఒక్క గుక్కెడు తాగుంటే ఎలుక్కాదు, ఎలుగ్గొడ్డయినా, నాలుక వెళ్లపెట్టి మరీ చచ్చూరుకునేది. ఏద్దైతేనేం. నువ్వు కేశవులు మీద పగతీర్చుకున్నావు. తొందరపాటులో నువ్వు కొట్టిన దెబ్బ అతగాడి తలమీది నుంచి జారి, గూటిమీద బలంగా తగిలింది. వాడి గూడు మోకాళ్ళ దగ్గరకు దిగజారి పోయిందనుకో. వాడు బతకడు, బతికినా అవిటి బతుకే" అన్నాడు.

"వాడు బతికితేనే బాగు ధర్మయ్యా. నాకు ఉరిశిక్ష తప్పుద్ది" అన్నాడు బొబ్బిలి ఏడుపు గొంతు పెట్టి.

దిరిశెన చెట్టు కొమ్మలు బలమైన గాలి తాకిడి తిన్నట్టు కిఱ్ఱు కిఱ్ఱు మన్నవి. ఆ వెంటనే ఒక పెద్ద గొంతు, "ఎవడ్రా, ఆ రోనేవాలా? తిను, తాగు, పాడు" అన్నది.

బొబ్బిలి తలెత్తి కొమ్మల్లోకి చూస్తూ, "వాడు గారడీ బుడేసాయిబు కాదూ? వాడు చచ్చి రెండు మూడేళ్ళయిందిగందా? యానాది యీరడు పట్టుకొచ్చి కుండలో దాచిన తాసుపామును, తాగిన మైకంలో ముద్దెట్టుకోపోతే కాటుదెబ్బతిని చచ్చాడు గందా?" అన్నాడు బెదిరిపోతూ.

"మనం సచ్చామో, బతికేహున్నామో తెలిస్తే హిక లేందేది బే! హది తెలీకేగా హీ శెట్టూ కొమ్మల్ పట్కొ హేల్లాట్టం. హీ లోకమే బడా జాదూ. మన కవీ కట్టిన డఫల్ ఫన్నా జాకెట్టు పాట విన్నావ్? అదొక్కటే సత్తెం? పాడమన్నావ్?" అన్నాడు గారడీ బుడేసాయిబు.

"ధర్మయ్యా, అంతా ఏదో యిది యిదిగా వుంది ఆ బుడేసాయిబు చావటం నాకు తెలుసు. ఆ పాడేది దెయ్యం పాట" అన్నాడు బొబ్బిలి.

అంతవరకూ తగ్గుస్థాయిలో పాడుకుంటున్న గారడీ బుడేసాయిబు, బొబ్బిలి మాటలు వింటూనే, "వ్హా వ్హా!" అంటూ విరగబడి నవ్వి, పెద్దగా గొంతెత్తి పాటను లంకించుకున్నాడు.

"వ్హాణ్ణి రమ్మన్నాదీ – వ్హీణ్ణి రమ్మన్నాది హిద్దర్నీ రమ్మనీ – నిద్దరోయిందో, నిలా నిలా నిలభండీ హ్వాబ్బ దాని సోకో డభల్ ఫన్నా జాకెట్టూ –"

"నువ్వూ, నీ పాటా తగలడా, వూరుకోరా బుడే" అన్నాడు ధర్మయ్య విసుక్కుంటూ.

బుడేసాయిబు పాటాపి 'హిహిహీ' అంటూ నవ్వసాగాడు.

"ఇక్కడంతా నానా కశ్మలం చేరింది. బెబ్బులీ, వీళ్ళ వెకిలిచేష్టల్ని భరించటం మహాకష్టం. అందులో కొత్తగా వచ్చిన వాడివి. ఓ వారం రోజులు గడిస్తే అంతా నీకూ అలవాటైపోద్దిలే"

అంటూ ధర్మయ్య బొబ్బిలి చేయి పట్టుకుని, దిరిశెన చెట్టు కొమ్మల మీదికి ఎగిరాడు.

ఆశ్చర్యం! బొబ్బిలి అతడితోపాటు గాలిలో తేలిపోయి, చెట్టుకొమ్మ మీద నిలబడ్డాడు.

"అంతా కల్లా వుంది ధర్మయ్యా. మనిషి పక్షిలా ఎగిరి కొమ్మెక్కటం ఏంటి?" అన్నాడు బొబ్బిలి.

"అంతా, నువ్వు తాగిన ఎలుక మందు కలిపిన కాపుసారా కల్పిస్తున్న భ్రమ. గాభరా పడకు" అన్నాడు ధర్మయ్య బుజ్జగిస్తున్నట్టు.

"అరే భాయ్. నువ్వు చేశ్నా గడబిడేంటి బే? ఆడి పెళ్ళాన్ని మోయించి కేశ్వుల్ని సంపావ్, బులో దీన్ దీన్" అంటూ చప్పట్లు చరిచాడు బుడేసాయిబు.

ధర్మయ్య అక్కడ కొమ్మల మీద వున్న అందరికేసీ ఓమారు చూసి, బొబ్బిలి చూడకుండా ఏదో సైగ చేశాడు. ఆ వెంటనే అందరూ గప్‌చిప్ అయిపోయారు.

తాటితోపుకు దాపుల్న ఎవరో మాట్లాడుకుంటున్న ధ్వని వినబడింది. కొమ్మల మీద వున్న వాళ్ళంతా ఒక్కసారి తలలు వంచి కిందికి చూశాడు. ఉదయిస్తున్న సూర్యకాంతి ధాటికి చెట్టు కింద గూడు కట్టుకున్న చీకటి గుయ్యారం, తోపులోని పాడుబడ్డ ముత్రాసోళ్ళ లంకలాంటి ఇంటి కేసి పరిగెత్తింది.

"తెల్లవారుతున్నది. ఇక మనం యీ కొమ్మల్లో వుండటం ప్రమాదం. ముత్రాసోళ్ళ పాడుకొంప లోకి పదండి" అంటూ ధర్మయ్య లేచాడు.

"అమ్మో, నేనక్కడికి రాను. ఆ కొంపలో పట్టపగలే దెయ్యాలు కుస్తీపట్లు పడుతూంటాయ్" అంటూ బొబ్బిలి లబలబలాడాడు.

"నేను దయ్యాలపోతుని. ఆ దెయ్యాలు మననేం చెయ్యలేవు. అటు చూడు, ఇద్దరు పోలీసులూ, ఇన్‌స్పెక్టరూ, మునసబూ అంతా ....నీ కోసమే గాలిస్తున్నారు" అన్నాడు ధర్మయ్య.

"అయితే, కేశవులుగాడు సచ్చేవుంటాడేవోఁ!" అన్నాడు బొబ్బిలి భయంతో వణికిపోతూ.

"చెప్పలేం. ఏదైనా, నువ్వు కొన్నాళ్లీ తోపులో మాతోపాటు దాక్కునుండటం నీకు మేలు. మేమంతా తలో హత్యచేసి, పోలీసులకి దొరక్కుండా యిక్కడ దాక్కుని బతుకుతున్నవాళ్ళమే" అన్నాడు ధర్మయ్య.

ధర్మయ్య చేయిచాచి బొబ్బిలి చేయి పట్టుకుని, కొమ్మల మీద వున్న తతిమ్మా వాళ్ళతో, "ఊఁ పదండి!" అన్నాడు.

అద్భుతం! కనుమూసి తెరిచేంతలో అందరూ ముత్రాసోళ్ళ పాడుపడ్డ కొంప అటకమీద చీకట్లో కూచుని వున్నారు.

"మనం చిటికేసేంతలో, అక్కణ్ణించిక్కడికెట్టా వచ్చాం?" అన్నాడు బొబ్బిలి ధర్మయ్యకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"అంతా కనికట్టు!" అంటూ ముసిముసి నవ్వులు నవ్వాడు ధర్మయ్య.

"దాన్నే మేం బాగ్దాదులో జాదూ సెప్తాం" అంటూ బుడేసాయిబు విరగనవ్వసాగాడు.

"ఊష్!" అన్నాడు ధర్మయ్య.

అంతా నిశ్శబ్దం.

ఒకటి రెండు నిమిషాల తరవాత పోలీసులూ, గ్రామ మునసబూ ఆ అటక కిందకి వచ్చారు.

ఇన్‌స్పెక్టరు అటకకేసి వేలు చూపుతూ, "అక్కడ కూడా చూడటం మంచిది. ఆ ఇద్దరూ అక్కడ దాక్కోవటం ఏమంత కష్టం కాదు" అన్నాడు.

మునసబు చెప్పగానే, ఓ పాత నిచ్చెన తెచ్చి మోతాదుల్లో ఒకడు అటక అంచుకు ఆనవేశాడు.

"ఊఁ చూస్తావే? ఎక్కిచూడు" అన్నాడు మునసబు.

"వాళ్ల దగ్గిర కత్తులో బరిశలో వుంటే" అన్నాడు మోతాదు, నిచ్చెన మెట్టొక్కటి ఎక్కి.

"నా రివాల్వర్ ముందు వాళ్ల కత్తులూ బరిశెలూ ఎంత? కాల్చి పారేస్తాను. ఊఁ ఎక్కి చూడు" అన్నాడు ఇన్‌స్పెక్టరు కోపంగా.

"అంత భయపడి చస్తా వేం? నీ దగ్గిరా బరిశె వుందిగా" అన్నాడు మునసబు.

మోతాదు బరిశె ఎత్తి పట్టుకు నిచ్చెన మెట్లెక్కి పోయి, అటక మీది చీకట్లోకి ఓమారు కళ్ళు చికిలించి చూసి, "ఇక్కడెవరూ లేరు" అన్నాడు.

"ఆ చీకట్లో వున్నదీ లేనిదీ ఎలా తెలుస్తుంది? అగ్గిపుల్ల ఎలిగించి చూడు" అన్నాడు మునసబు విసుగ్గా.

మోతాదు చేతిలోని బరిశెతో అటక మీది చీకటిని, అక్కడా యిక్కడా మహా వూపుగా పొడిచి చూశాడు. మొదటి బరిశె పోటు ధర్మయ్య డొక్కలో పడింది. అతడు కిక్కురు మనలేదు. రెండో పోటు బుడేసాయిబు గుండెల్లో పడింది. అతను 'వ్హా వ్హా' అంటూ నవ్వ సాగాడు. ఈ వింతేమిటని ఆశ్చర్యపడుతూ అతడికేసి కళ్ళప్పగించి చూస్తూన్న బొబ్బిలి పొట్టలో మూడో బరిశె పోటు పడింది. అంతేసి బరిసె పోటునూ అతడు గమనించినట్టే లేదు. కాని, నాలుగోసారి మోతాదు బరిశెను మళ్ళీ అక్కడే తాటించబోయేసరికి బొబ్బిలి కెవ్వున కేకవేసి వెనక్కు విరుచుకుపడిపోయాడు.

ధర్మయ్య అతడి చెవి దగ్గిర వంగి, "దయ్యాలబోతు ధర్మయ్య పిలుస్తున్నాడు, లే!" అని పదీ పదిహేనుసార్లు అన్న తరవాత, బొబ్బిలి ఆవిలిస్తూ లేచికూచున్నాడు.

"నీకు ప్రమాదం తప్పింది. వాళ్ళెళ్ళిపోయారు" అన్నాడు ధర్మయ్య.

"నాకంతా అయోమయంగా, గుబులు గుబులుగా వుంది. ఆ ఇనస్పెట్టరు యిక్కడ యిద్దరుంటారు. చూడమంటాడేం? కేశవుల్ని చంపింది నేనొక్కణ్ణే గందా? మోతాదుచేత బరిశెపోటు తిని బడే సాయిబు సచ్చాన్రో అని నేలకరవక, హా హా అని నవ్వుతాడేం?" అన్నాడు బొబ్బిలి.

"అంతా కనికట్టు!" అన్నాడు ధర్మయ్య, మీసాలు ఎగదువ్వుకుంటూ.

"ఊహు! నాకు నమ్మబుద్దవటంలేఁ!" అన్నాడు బొబ్బిలి.

పగలూ, రాత్రీ – వెన్నెలా, చీకటీ – దిరిశన చెట్టు కొమ్మలూ, ముత్రాసోళ్ళ పాడుకొంపలో అటకా – వీటిమధ్య బతుకు గడచిపోవడంతో బొబ్బిలికి, తనా తాటితోపులోకి వచ్చి ఎంతకాలం అయిందో తెలియలేదు. దెయ్యాలపోతు ధర్మయ్యా గారడీ బుడేసాయిబూ, తతిమ్మావాళ్ళు కూడా, రోజులూ నెలలూ లెక్కపెట్టుకుంటున్నట్టు లేదు.

"ఎన్నాళ్ళిలా దొంగబతుకు బతకటం? నేనెళ్ళి పోలీసోళ్ళకు పట్టుబడి పోతా" అన్నా డొకరోజున బొబ్బిలి, ధర్మయ్యతో.

"నీ కిక్కడొచ్చిన కష్టమేమిటి? రోజెలా గడవటం అన్న బాధ లేదు. ఆకలి లేదు, దప్పికా లేదు. అసలు నీకు ఊళ్ళో పెళ్ళాం బిడ్డలు కూడా లేరాయె. ఇక్కడ మాతోటే హాయిగా కాలక్షేపం చెయ్యి" అన్నాడు ధర్మయ్య.

ఆకలీ దప్పిక లేవన్న ధర్మయ్య మాట వింటూనే బొబ్బిలి బెంబేలుపడి పోయాడు. మనిషన్న తరవాత ఆకలీ దప్పికలు లేకపోవటమేమిటి?

బొబ్బిలి వాలకం చూసి ధర్మయ్య చిరునవ్వు నవ్వుతూ, "అంత గాభరా పడిపోకు. అంతా కని కట్టు! ......కొంచెం ఆగు యిప్పేస్తాను" అన్నాడు.

కొద్ది రోజులు గడిచినై. ఒకనాటి మిట్టమధ్యాన్నం మిడసరి లగ్నం వేళ. పాడుపడ్డ యింటి ముందున్న దిగుడు బావి వైపునుంచి యికయికలూ పకపకలూ అటక మీదున్న బొబ్బిలికి వినిపించినై. ఆశ్చర్యపడుతూ అతడు బయటికి తొంగి చూశాడు.

చెన్నకేశవులు చంకకఱ్ఱ ఆసరాతో కుంటు కుంటూ నడుస్తూ, మధ్యమధ్య దాన్ని పైకెత్తి, ముందు వస్తూన్న ఎరికల రత్తి నడ్డిమీద సుతారంగా పొడుస్తున్నాడు.

అది "హేయ్ మావోఁ" అంటూ కోపగించుకోబోయి కిలకిలమని నవ్వేస్తున్నది.

అది చూస్తూనే బొబ్బిలి గుండెలు భగ్గు మన్నవి. తన దొంగ బతుక్కు కారకుడైన దుర్మార్గుడు బతికుండటమేగాక, సొంత సొమ్మయినట్టుగా రత్తితో ఎకసక్కాలాడుతున్నాడు.

"ధర్మయ్యా! ఒక అత్యకి రెందుర్లుండవ్ – ఆ కేశవులుగాడు మనం అనుకున్నట్టు సావకపోగా, రత్తితో సరసాలాడేస్తున్నాడు. ఆణ్ణిప్పుడు నిలువునా పేల్చేస్తాను" అంటూ బొబ్బిలి హుమ్మని లేచి నిలబడ్డాడు.

"ఆణ్ణి చంపటం నీ వల్ల కాదు. పట్టు" అన్నాడు ధర్మయ్య.

బొబ్బిలి నివ్వెరపోతూ, "పట్టటమే?" అన్నాడు.

"కనికట్టిప్పేస్తున్నాను. బెబ్బులీ, కాస్త శాంతంగా వుండు. మరీ రోషపడ్డావంటే నెత్తురు గుండెల కెదగట్టి ప్రమాదం తేవచ్చు. మనకు మనుషుల్ని కొట్టి, పొడిచీ చంపే శక్తి లేదు. కావాలంటే పట్టుకుని కొన్నాళ్ళపాటు ఏడిపించి, నానా హింసా పెట్టొచ్చు. తెలిసిందా?" అన్నాడు ధర్మయ్య అతి గంభీరంగా.

"అంటే నేను సచ్చిపోయానన్నమాట. దెయ్యాన్నన్నమాట! ఈ సంగతి మొదట్లోనే ఎందుకు సెప్పావు కాదు ధర్మయ్యా" అంటూ బొబ్బిలి బావురుమన్నాడు.

ధర్మయ్య అతడి భుజం మీద చేయివేసి అనునయిస్తూ, "ఆ చెప్పకపోవటం నీ మంచికే. హఠాత్తుగా ఆ దుర్వార్త చెప్పేస్తే గుండె పగిలి చస్తావని భయపడ్డాను" అన్నాడు.

❋

(యువ మాసపత్రిక : డిసెంబర్, 1964 :: రచన మాసపత్రిక : మే, 2010)